సాక్షి
అన్నమయ్య జిల్లా

మంగళవారం । 19 । నవంబర్ । 2024



క్రమశిక్షణతో విధులు..

హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ సూచించారు. -8లో



22న నామినేషన్ల స్వీకరణ

వందేళ్ల ఘనచరిత్ర కలిగిన ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ పాలకవర్గ ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. -8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.290	రూ.300
రెండోరకం	రూ.200	రూ.280

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 220 మెట్రిక్ టన్నులు



న్యూస్‌రీల్

పల్లకిలో ఊరేగిన భద్రకాళీ సమేతుడు



రాయచోటి టౌన్ : రాయచోటి శ్రీ భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామికి అత్యంత భక్తిశ్రద్ధలతో పల్లకి సేవ చేశారు. సోమవారం రాత్రి మూలవిరాట్‌లకు పూజలు, అభిషేకాలు నిర్వహించి అందంగా అలంకరించారు. అనంతరం ఉత్సవమూర్తులకు అభిషేకాలు, పూజలు జరిపి పల్లకిలో ఊరేగించారు. ఈ పల్లకి సేవలో స్థానిక భక్తులతోపాటు ఇతర రాష్ట్రాల నుంచి భక్తులు తరలివచ్చారు.

పోస్టర్ల ఆవిష్కరణ

రాయచోటి : జిల్లాలోని పశువులకు వంద శాతం బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాలు వేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కలెక్టర్ శ్రీధర్ పశుసంవర్ధకశాఖ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీ ఆర్ఎస్ సమావేశ హాలులో బ్రూసెల్లోసిస్ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమానికి సంబంధించిన ప్రచార పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ వ్యాధికి చికిత్స లేదని నివారణకు టీకాలు ఒకటే మార్గమని కలెక్టర్ సూచించారు. 4 నుంచి 8 నెలల గల పేయ దూడలకు తప్పనిసరిగా టీకా వేయించాలన్నారు. డీఆర్ఓ మధుసూదన్ రావు, ఎస్డీసీ రామసుబ్బయ్య, ఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా పశుసంవర్ధకశాఖ అధికారి గుణశేఖర్ పిళ్లై, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

టైలరింగ్,బ్యూటీషియన్ కోర్సులో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కెనరా బ్యాంకు స్వయం ఉపాధి శిక్షణా సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 20 నుంచి టైలరింగ్, బ్యూటీ పార్లర్‌లో 30 రోజుల పాటు ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ ఆరిఫ్ ఒక ప్రకటనలో తెలిపారు. 18 నుంచి 45 ఏళ్ల మధ్య వయసు కలిగి గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలు అర్హులని ఆయన పేర్కొన్నారు. దూర ప్రాంతాల వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం స్థానికంగానే కల్పిస్తారన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబర్లు : 94409 05478, 99856 06866, 94409 33028 లలో సంప్రదించాలని వివరించారు.

వైఎస్సార్ జిల్లాలో వర్షం

కడప అగ్రికల్చర్ : జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం వర్షం కురిసింది. పెండ్లిమర్రిలో అత్యధికంగా 10.2 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. అలాగే రాజుపాళెంలో 10.8, పెండ్లిమర్రి 19.2, చింతకొమ్మదిన్నె 9.6, ఒంటిమిట్ట 8.4, కడప 8, ప్రొద్దుటూరు 4.2, దువ్వూరు 2.8, చెన్నూరు 1.6, ముద్దనూరులో 1.2 మి.మీ వర్షం పడింది.

108 సిబ్బంది నిరాహార దీక్ష

కడప సెవెన్‌రోడ్స్ : తమ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ రాష్ట్ర పిలుపులో భాగంగా 108 సర్వీసు ఉద్యోగులు సోమవారం కలెక్టరేట్ ఎదుట రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. వారికి సీఐటీయూ నాయకులు బి.మనోహర్, వెంకటసుబ్బయ్య, చంద్రారెడ్డి, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఎల్.నాగసుబ్బారెడ్డి సంఘీభావం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పలు దఫాలుగా శాంతియుత నిరసన కార్యక్రమాలు చేపట్టినప్పటికీ యాజమాన్యం, ప్రభుత్వ అధికారులు.. సమస్యలు పరిష్కరించకపోవడంతో రిలే దీక్షలు చేపట్టాల్సి వచ్చిందన్నారు. 108 అంబులెన్స్ వ్యవస్థను నేరుగా ప్రభుత్వమే నిర్వహించాలని, సిబ్బందిని ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. రోజుకు మూడు షిఫ్టులలో ఎనిమిది గంటల పనివిధానం అమలు చేయాలన్నారు. 108లో పని చేస్తున్న ఉద్యోగులకు ప్రభుత్వ నియామకాల్లో వేయిటేజీ మార్కులు ఇవ్వాలన్నారు. వైద్య ఆరోగ్యశాఖలో ఈఎంటీ పోస్టుల నియామకాల్లో 108లో పని చేస్తున్న ఈఎంటీలను నియమించాలన్నారు. తమ న్యాయమైన కోర్కెలను పరిష్కరించకపోతే ఈనెల 25 నుంచి సమ్మె చేపడతామని హెచ్చరించారు.

రేపు డయల్ యువర్ ఆర్ఎం

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆర్టీసీ ప్రయాణికుల సమస్యల పరిష్కార నిమిత్తం డయల్ యువర్ ఆర్ఎం కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించనున్నట్లు జిల్లా ప్రజా రవాణాధికారి పొలిమేర గోపాల్‌రెడ్డి తెలిపారు. సాయంత్రం 4 నుంచి 5 గంటల వరకు ప్రయాణికులు తమ సమస్యలు, సూచనలు, సలహాలను 995922 5848 నంబరుకు ఫోన్ లేదా వాట్సాప్ ద్వారా తెలియజేయాలని ఆయన పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

అపార్‌మైన అవస్థలు



- తప్పుల తడకగా విద్యార్థుల ఆధార్ వివరాలు
- 'జనన ధ్రువీకరణ పత్రం ఉంటేనే సవరణలు'
- విద్యార్థుల తల్లిదండ్రులకు తప్పని అవస్థలు



ఆధార్ కార్డులో సవరణ కోసం కేంద్రం వద్ద విద్యార్థుల పడిగాపులు

గాలివీడు : జాతీయ విద్యా విధానంలో భాగంగా ప్రతి విద్యార్థికి గుర్తింపు కార్డు జారీకి కేంద్రం ఆటోమేటెడ్ పర్మనెంట్ అకడమిక్ అకౌంట్ రిజిస్ట్రీ (అపార్)ను ప్రారంభించింది. వన్ నేషన్ – వన్ స్టూడెంట్ ఐడెంటిటీ పేరుతో విదార్థులకు ప్రత్యేక గుర్తింపు కార్డులు జారీ చేస్తున్నారు. ప్రస్తుతం ఈ ఐడీ పొందడానికి విద్యార్థులు తీవ్ర అవస్థలు పడుతున్నారు. అపార్ నమోదుకు జనన ధ్రువీకరణ పత్రంతో పాటు తప్పులు లేని ఆధార్ కార్డు తప్పనిసరిగా ఉండాలనే నిబంధన ఉంది. ఇక్కడే చిక్కంతా వస్తోంది. ప్రతీ విద్యార్థికి పాఠశాలలో నమోదైన వివరాలు, ఆధార్‌లో ఉన్న వివరాలు ఒకేలా ఉండాలి. 70 శాతం మంది పిల్లలకు పాఠశాల రికార్డుల్లోని సమాచారానికి.. ఆధార్‌లోని వివరాలకు సరిపోలడం లేదు. పైగా గ్రామీణ ప్రాంతాల్లో చాలా మంది విద్యార్థులకు జనన ధ్రువీకరణ పత్రాలు లేవు. దీంతో ఆయా పత్రాలు పొందడానికి.. ఆధార్‌లో తప్పులు సవరించుకోవడానికి విద్యార్థులు, వారి తల్లిదండ్రులు రెవెన్యూ, పంచాయతీ కార్యాలయాలు, ఆస్పత్రుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి నెలకొంది. కాగా జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లో ఒకటి నుంచి డిగ్రీ వరకు చదువుతున్న విద్యార్థులకు అపార్ నమోదు జరుగుతోంది.

ఈ కార్డుల జారీ బాధ్యతలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు ప్రభుత్వం అప్పజెప్పింది. ఈనెల 30లోగా ప్రక్రియను పూర్తి చేయాలని గతంలోనే ఆదేశాలు జారీ అయ్యాయి. పాఠశాల రికార్డుల్లో నమోదైన వివరాల ప్రకారం ఆధార్‌లో సవరణ చేసుకోవడానికి యూఐడీ వారు జనన ధ్రువీకరణ పత్రం తప్పనిసరి చేశారు. విద్యార్థులు జనన ధ్రువీకరణ పత్రం కావాలంటే తొలుత పంచాయతీ కార్యాలయంలో నాన్‌– ట్రేస్డ్ సర్టిఫికెట్ తీసుకుని మీ సేవా లేదా సచివాలయాల్లో తగిన ధ్రువపత్రాలతో తహసీల్దార్‌కు దరఖాస్తు చేసుకోవాలి. దీనిని క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆర్డీఓకు నివేదిస్తారు. ఆర్డీఓ పరిశీలన అనంతరం పుట్టిన తేదీ ధ్రువపత్రం జారీ చేస్తారు. ఈ ప్రక్రియ పూర్తికావడానికి 20 రోజుల నుంచి 30 రోజులు పడుతోంది. అపార్‌లో నమోదుకు ఈ నెలాఖరు వరకే గడువు ఉండడంతో పిల్లల జనన ధ్రువీకరణ పత్రాల కోసం విద్యార్థుల తల్లిదండ్రులు అష్టకష్టాలు పడుతున్నారు. పాఠశాలల రికార్డుల్లోని వివరాల ప్రకారం విద్యార్థుల ఆధార్ కార్డులో వివరాలు మార్చేలా అధికారులు చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు. ఆధార్ సవరణ బాధ్యత హెచ్ఎంలకు అప్పగిస్తే ప్రయోజనం ఉంటుందని అంటున్నారు. దీని కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తే అపార్ నమోదు మరింత వేగవంతం అవుతుంది. ఈ దిశగా అధికారులు నిర్ణయం తీసుకోవాల్సిన అవసరం ఉంది.

అపార్‌తో ప్రయోజనం

అపార్ కార్డు విద్యార్థులకు ఎంతో కీలకం కానుంది. ఇందులో విద్యార్థులకు సంబంధించిన పూర్తి సమాచారం పొందుపర్చనున్నారు. 12 అంకెలతో కూడిన జీవిత కాల ఐడీ నెంబర్ ఇస్తారు. దీని ద్వారా విద్యార్థులు అకడమిక్ రికార్డులను ఎక్కడి నుంచైనా, ఎప్పుడైనా పొందవచ్చును. విద్యార్థుల విద్యా ప్రమాణం, విజయాలను ఎప్పటికప్పుడు నమోదు చేయడంతో పాటు ట్రాక్ చేస్తుంది. అలాగే ఒక పాఠశాల నుంచి మరొక పాఠశాలకు బదిలీ అయ్యేందుకు ఉపయోగపడుతుంది.

అపార్ శరవేగంగా జరిగేలా చర్యలు



ఆపార్ నమోదు ప్రక్రియలో సమస్యలు ఉన్నాయి. ఒక్కొక్కటి పరిష్కరించుకుంటూ ముందుకు వెళ్తున్నాం. ఇప్పటికే ప్రధానోపాధ్యాయులకు, మండల విద్యాధికారులకు అపార్ నమోదు ప్రక్రియ వేగవంతం చెయ్యాలని దిశానిర్దేశం చేశాం. చాలా మంది విద్యార్థులకు ఆధార్ జారీ చేసేటప్పుడు పుట్టిన సంవత్సరం, పేరు, చిరునామా వంటి వివరాల్లో తప్పులుంటే ఆపార్ రిజిస్టర్ కావడం లేదు. ఏదైనా సమస్య వస్తే వెంటనే పరిష్కారానికి చర్యలు తీసుకుంటున్నాం. నవంబర్ 30వ తేదీ నాటికి పూర్తవ్వడానికి ప్రణాళిక సిద్ధం చేశాం.

- సుబ్రహ్మణ్యం, డీఈఓ, అన్నమయ్య జిల్లా

ఆధార్ మార్చడానికి ప్రత్యేక అవకాశం కల్పించాలి



రోజుల తరబడి ఆధార్ కేంద్రం చుట్టూ తిరిగినా ఫలితం లేదు.వందల సంఖ్యలో విద్యార్థులు వస్తుండటంతో పోస్టాఫీస్ ఒకే కేంద్రం కావడం వల్ల సవరణ చేయలేకపోతున్నారు. ఆధార్‌లో మార్పులు చేర్పులు చేసుకునేందుకు ప్రత్యేక అవకాశం కల్పిస్తే తప్ప ఈ సమస్య పరిష్కారం కాదు.

- హిమశ్రీ,9 వ తరగతి, బాలికోన్నత పాఠశాల, గాలివీడు

ఆధార్‌లో సవరణకు అవస్థలు పడుతున్నాం



అపార్ రిజిస్ట్రేషన్‌కు ఆధార్ వివరాలు నమోదు తప్పనిసరి చేయడంతో ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఆధార్‌లో తప్పులు ఉండటం వాటిని సరిచేయడంలో జాప్యం జరుగుతోంది. గంటలు తరబడి ఆధార్ కేంద్రం వద్ద వేచి ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. అధికారులు సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలి.

- జి.శిరీషా,10వ తరగతి, బాలికోన్నత పాఠశాల, గాలివీడు

• కార్తిక దీప శోభ

కార్తిక దీపాల వెలుగుల్లో శివాలయాలు కళకళలాడాయి. కార్తిక మూడవ సోమవారాన్ని పురస్కరించుకొని జిల్లా వ్యాప్తంగా శివాలయాల్లో మహిళలు పెద్దఎత్తున దీపాలను వెలిగించారు. అలాగే ప్రత్యేక అలంకరణలో కొలువుదీరిన శివపార్వతులను దర్శించుకొని విశేషంగా పూజలు నిర్వహించారు. పల్లె, పట్టణం తేడా లేకుండా అన్ని ప్రాంతాల్లో భక్తుల సందడి కనిపించింది.

– రాజంపేట టౌన్



రాజంపేట టౌన్ : దీపాలతో శివలింగాకారం



రాజంపేట టౌన్: శివాలయంలో భక్తుల క్యూ



సంబేపల్లె : మోటకట్ల శివాలయంలో దీపాలు వెలిగిస్తున్న భక్తులు

భక్తిశ్రద్ధలతో తహలీల్ ఫాతెహా



ప్రఖ్యాత కవుల ముషయిరాలో పాల్గొన్న రామ్ చరణ్, పీఠాధిపతి, భక్తులు



ముషాయిరా చెబుతున్న కవి

- మలంగ్‌షాచే దీక్ష విరమింపజేసిన పీఠాధిపతి
- భక్తులకు మహానైవేద్యం పంపిణీ
- ప్రత్యేక అతిథిగా సినీ నటుడు రామ్‌చరణ్‌తేజ్

కడప కల్చరల్ : కడప పెద్ద దర్గాలోని సయ్యద్‌షా ఆరీఫుల్లా మొహమ్మద్ మహమ్మదుల్ హుసేనీ చిష్టివుల్ ఖాద్రి ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం తహలీల్ ఫాతెహా భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. పీఠాధిపతి సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ తమ స్వగృహం నుంచి ఫకీర్ల మేళతాళాలు, విన్యాసాల మధ్య ఊరేగింపుగా మహా నైవేద్యంగల పవిత్రమైన పాత్రను దర్గా ప్రాంగణంలోకి తీసుకు వచ్చారు. ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించి పాత్రలోని నైవేద్యాన్ని భక్తులకు ప్రసాదంగా పంచి పెట్టారు. ఉరుసు ఉత్సవాల్లో తహలీల్ ఫాతెహాగా అందించే ప్రసాదం కోసం భక్తులు పెద్ద సంఖ్యలో వేచి ఉన్నారు. ప్రార్థనల అనంతరం దర్గా నిర్వాహకులు భక్తులందరికీ ప్రసాదాన్ని పంచిపెట్టారు. ప్రధాన గురువుల మజార్ల వద్ద పీఠాధిపతి ప్రార్థనలు చేశారు.

మలంగ్‌షా దీక్ష విరమణ

ఉరుసు ఉత్సవాల ప్రారంభం నాడు తపోదీక్ష వహించిన మలంగ్‌షా సోమవారం దీక్ష విరమించారు. పీఠాధిపతి సయ్యద్‌షా ఆరీఫుల్లా హుసేనీ శిష్య గణంతో కలిసి ఊరేగింపుగా వెళ్లి మలంగ్‌షాను స్వయంగా దీక్ష విరమింపజేశారు. అనంతరం భక్తులు పెద్ద ఎత్తున అట్టహాసంగా మేళతాళాలు, సాహస విన్యాసాలతో మలంగ్‌షాను దర్గా చుట్టూ ఏడుసార్లు ప్రదక్షిణలు చేయించారు. దర్గా ముజావర్ అమీర్ పర్యవేక్షణలో కార్యక్రమాలు జరిగాయి.

రామ్‌చరణ్ ప్రత్యేక ప్రార్థనలు

నటుడు రామ్‌చరణ్‌తేజ్ పెద్దదర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొన్నారు. సోమవారం రాత్రి జరిగిన కార్యక్రమానికి ప్రత్యేక అతిథిగా హాజరయ్యారు. కడపకు వచ్చిన ఆయన శ్రీ విజయదుర్గాదేవి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. అక్కడి నుంచి నేరుగా పెద్దదర్గాకు చేరుకున్నారు. దర్గాలోని ప్రధాన గురువుల మజార్ వద్ద ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన ముషాయిరాలో పాల్గొన్నారు. సినీ నటుడు రామ్‌చరణ్ వెంట దర్శకుడు బుచ్చిబాబు, అభిమాన సంఘం నాయకులు వచ్చారు.



పెద్ద దర్గాలో భారీగా భక్తజనం

నడిపించే నాయకుడెవరు?

చెప్పండి బాబూ..

- తమకోనేత కావాలంటున్న 'రాజంపేట' టీడీపీ క్యాడర్
- తెరపైకి పచ్చ దళారులు..



రాజంపేట పట్టణ వ్యూ

రాజంపేట : పార్లమెంటరీ నియోజకవర్గ కేంద్రమైన రాజంపేటకు నాయకుడెవరో తెలియని.. చెప్పలేని స్థితిలో అధికారపార్టీ నిలిచింది. తమ నాయకుడెవరో.. అసలు ఈ పార్లమెంట్ పరిధిలో ఇన్‌చార్జి ఎవరో దిక్కు తెలియనిస్థితిలో క్యాడర్ కొట్టుమిట్టాడుతోంది. ఫలితంగా పార్టీ క్యాడర్‌లో నైరాశ్యం నెలకొంది. నేనే ఇన్‌చార్జ్ అని ఒకరు..తనదే జరగాలంటూ ఇంకొకరు..లేదులేదు తానే త్వరలో ఇన్‌చార్జినవుతా అని మరొకరు ఇలా ఎవరిమటుకు వారు అధికారంతో చెడుగుడు ఆడేసుకుంటున్నారు.

తమకొకనేత కావాలంటూ..

రాజంపేట నియోజకవర్గంలోని తెలుగుదేశం పార్టీ మూడుముక్కలాటగా మారింది. గత ఎన్నికల్లో టీడీపీ అభ్యర్థిగా ఓటమిపాలైన సుగవాసి బాలసుబ్రమణ్యం, రాజంపేట పార్లమెంటరీ పార్టీ జిల్లా అధ్యక్షుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు ప్రస్తుతం ఇన్‌చార్జి పదవి రేసులో కొనసాగుతున్నారు. ఇక ఎన్నికల ముందు రాజంపేట ఇన్‌చార్జ్‌గా ఉన్న బత్యాల చెంగల్రాయులు పార్టీలో ఉన్నా ప్రస్తుతానికి సైలెంట్‌గా ఉన్నారు. దీంతో అసలు ఇక్కడ నాయకుడెవరో.. తమ సమస్యలు ఎవరికి చెప్పుకోవాలో తెలీక తమకొకనేత కావాలంటూ పార్టీ క్యాడర్ బహిరంగంగానే డిమాండ్ చేస్తోంది. ఈ నేపథ్యంలో ఇటీవల అధికారపార్టీ నియోజకవర్గ నేతలతో సంబంధం లేకుండానే కొంతమంది పార్టీ క్యాడర్ కలిసి సమావేశం నిర్వహించుకోవడం గమనార్హం. కాగా ఓడిపోయిన అభ్యర్థే ఇన్‌చార్జి అనే నిబంధన తనకు వర్తిస్తుందని సుగవాసి అధికారులతో చెప్పుకుంటూ సమావేశాలలో పాల్గొంటున్న సంగతి తెలిసిందే. ఇక ఎన్నికల ముందు రాజంపేట ఇన్‌చార్జిగా ఉన్న బత్యాల చెంగల్రాయుడు అటు రైల్వేకోడూరు.. ఇటు రాజంపేటకు అప్పుడప్పుడూ క్యాడర్‌తో తరచూ కలుస్తున్నారు. ఈయన పెత్తనం దాదాపు రాజంపేటలో తగ్గిపోయిందనే వాదన ఆ పార్టీ వర్గాల్లో వినిపిస్తోంది. అలాగే నందలూరుకు చెందిన మేడా విజయశేఖర్‌రెడ్డి టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధిగా కొనసాగుతున్నారు.

బాబు, లోకేష్‌తో డైరక్ట్ కనెక్షన్ ఉందంటూ..

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, ఆయన తనయుడు లోకేష్‌తో తమకు డైరక్ట్‌గా కనెక్షన్ ఉందని, ఏ పని అయినా చేసి పెడతామని కొంతమంది పచ్చనేతలు దళారి అవతారం ఎత్తినట్లు సమాచారం. బదిలీలు, నామినేటెడ్ పోస్టులతోపాటు తమ తమ సమస్యలు, ల్యాండ్ లిటికేషన్, అవుట్‌సోర్స్‌పోస్టులు తదితర వాటికి సందేట్లో సడేమియా లక్షలాదిరూపాయిలు వసూలు చేసుకుంటున్నట్లు ఆ పార్టీ వర్గాల్లో నే చర్చలు సాగుతున్నాయి. ప్రతినేతా మంత్రులు తోపాటు ఫొటోలు దిగడం, తమ పలుకుబడని వాట్సాప్ గ్రూపుల ద్వారా ప్రమోట్ చేసుకుంటున్నారు. ఆకర్షితులైనవారికి తాము ఏ పనైనా చేసిపెడతామంటూ కాసులను దండుకోవడం ఇప్పుడు రాజంపేటలో హాట్‌టాపిక్. ఇన్‌చార్జి ఎవరు లేరు..ఇన్‌చార్జితో అవసరం లేదంటూ పచ్చదళారులు జేబులు నింపుకుంటుండడం గమనార్హం.

రాజంపేట టు అమరావతికి చక్కర్లు..

అధికారపార్టీకి చెందిన నేతలు ఇప్పుడు అధికంగా అమరావతిలో కనిపిస్తున్నారు. రాజంపేట టు అమరావతి అన్నట్లుగా కొంతమంది నేతలు షైరవీలు చేసుకుంటున్నారు. సహజంగా అధికారపార్టీకి చెందిన ఎమ్మెల్యే సిఫార్సు ఉంటేనే ఏ మంత్రి, ఉన్నతాధికారి అయినా కావాల్సిన పని చేసి పెట్టడం కనిపిస్తుంది. ఇక్కడ అధికారపార్టీకి ఎమ్మెల్యే లేనందున, ఇన్‌చార్జి సిఫార్సులకు పని జరుగుతుంది. ఇప్పుడు ఆ ఇన్‌చార్జి ఎవరో తెలియని దుస్థితిలో ఎవరి నెట్‌వర్క్‌లో వారు పనిచేసుకుంటున్నారు.

సమస్యల ఏకరువు!



ఈ ఫొటోలో కనిపిస్తున్న వృద్ధురాలి పేరు సీతమ్మ. పీలేరుకు చెందిన ఈమె నడవలేక మనిషి సాయంతో కలెక్టరేట్‌కు వచ్చింది. వృద్ధాప్య పెన్షన్ కింద రూ. 4 వేలు వస్తోంది. నడవలేని తనకు వృద్ధాప్య పెన్షన్ కాకుండా మానవతా దృక్పథంతో వికలాంగుల పెన్షన్ అందించాలని కలెక్టరేట్‌లో ఇలా గోడ పట్టుకుని నడుస్తూ వచ్చి, కలెక్టర్ శ్రీధర్‌ను కలిసి తన గోడు వెళ్లబోసుకుంది.



ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

- ప్రజా సమస్యల పరిష్కార వేదికకు పెరుగుతున్న ఫిర్యాదులు
- భూ సమస్యకు సంబంధించిన బాధితులే అధికం
- పలుమార్లు అధికారులకు విన్నవిస్తున్నా పరిష్కారానికి నోచుకోని సమస్యలు

సాక్షి రాయచోటి : కూటమి ప్రభుత్వం కొలువుదీరాక ప్రజల్లో నైరాశ్యం ఆవహించింది. వైఎస్సార్ సీపీ హయాంలో వరుసపెట్టి ప్రతినెలలోనూ ఏదో ఒక సంక్షేమం తలుపు తట్టేది. పింఛన్ల జాతర జరిగేది. ప్రస్తుత ప్రభుత్వం ఆయా సంక్షేమ పథకాలకు మంగళం పాడి.. సూపర్ సిక్స్ పథకాలను అమలు చేయకుండానే అటకెక్కించింది. దీంతో ప్రజలకు సంక్షేమం అందని ద్రాక్షగా మారింది. పంటలు సరిగా పండక రైతన్నకు ఏదో ఒక కష్టమో.. నష్టమో వెంటాడుతూనే ఉంది. పైగా అధికార పార్టీ నేతల భూ దాహానికి చాలా మంది బాధితులుగా మారుతున్న పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో ఆయా సమస్యలకు పరిష్కారం చూపాలంటూ బాధితులు కలెక్టరేట్‌కు పరుగులు పెడుతున్నారు. కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి ప్రజలు అధిక సంఖ్యలో తరలి వస్తున్నారు. ముఖ్యంగా వికలాంగులు, వృద్ధులు పింఛన్ల కోసం కలెక్టరేట్ తలుపు తట్టడం కనిపిస్తోంది. ప్రతి సోమవారం 300–350 మంది ప్రజలు వివిధ రకాల సమస్యలతో ఇక్కడికి వస్తున్నారు.

అత్యధికంగా రెవెన్యూ సమస్యలు

ప్రధానంగా భూములకు సంబంధించి ఆన్‌లైన్, అండగల్, భూ వివాదాలు, ఆక్రమణలు, కబ్జాలపై ఫిర్యాదులు చేస్తున్నారు. ప్రతి శనివారం కలెక్టర్, జేసీ, ఆర్డీఓ చాంబర్లలో భూములకు సంబంధించి కోర్టు నిర్వహిస్తున్నా...సోమవారం కూడా భూ సమస్యలపైనే బాధితులు వస్తున్నారు. తగాదాల వల్ల పెండింగ్‌లో ఉన్న బాధితులతోపాటు.. ఇంటి పట్టాలు ఆక్రమణలు ఇలా ఎక్కువ సంఖ్యలో వచ్చి ఉన్నతాధికారులను కలుస్తున్నారు. సమస్యలు పరిష్కారం కాకపోవడంతో దూర ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల ఆశలు అడియాశలు అవుతున్నాయి.

అధికారుల నిర్లక్ష్యంపై ఆగ్రహం

రాయచోటిలోని కలెక్టరేట్‌లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి వివిధ శాఖల ఉన్నతాధికారులు రాకపోవడంపై కలెక్టర్ చామకూరి శ్రీధర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎట్టి పరిస్థితుల్లోనూ ఎక్కడున్నా ప్రతిసోమవారం కార్యక్రమానికి ఉదయం 10 గంటల్లోపు రావాలని సీరియస్ అయ్యారు. కొంతమంది 11 గంటలకు రావడం.. మరికొంతమంది ఉన్నతాధికారులు రాకుండా కిందిస్థాయి సబార్డినేట్లను పంపుతున్నారని, ఇది మంచి పద్ధతి కాదని హెచ్చరించారు. రానున్న రోజుల్లో జరిగే కార్యక్రమాలకు హెచ్ఓడీలు రావడంతోపాటు బాధితుల సమస్యలను బాధ్యతగా పరిష్కరించాలని ఆదేశించారు.

ఫిర్యాదుదారులు సమస్యలను పరిష్కరించాలి

రాయచోటి : అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ చామకూరి శ్రీధర్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ హాలులో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్‌తో పాటు డీఆర్ఓ కె.మధుసూదన్‌రావు, ఎస్డీసీ రామసుబ్బయ్య, ఆర్డీఓ శ్రీనివాస్ ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

భక్త కనకదాస బాటలో నడుద్దాం

రాయచోటి : భక్త కనకదాస చూపిన బాటలో నడుద్దామని కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ పేర్కొన్నారు. సోమవారం భక్త కనకదాస జయంతి సందర్భంగా రాయచోటి కలెక్టరేట్‌లో జిల్లా కలెక్టర్ ఛామకూరి శ్రీధర్ ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వెనుకబడిన తరగదతుల సంక్షేమశాఖాధికారి సందప్ప, కురుబ సంఘం నాయకులు బండి రెడ్డప్ప, శివ, న్యాయవాది ఈశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.



కలెక్టరేట్‌లో భక్త కనకదాస చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పిస్తున్న కలెక్టర్

క్లుప్తంగా

ప్రతి ఫిర్యాదుకు పరిష్కారం చూపిస్తాం

– అదనపు ఎస్పీ వెంకటాద్రి

రాయచోటి : ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అందుతున్న ఫిర్యాదులకు చట్టుపరిధిలో తప్పక పరిష్కారం చేస్తామని జిల్లా అదనపు ఎస్పీ వెంకటాద్రి పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) ఫిర్యాదులను స్వీకరించారు. ప్రజల నుంచి వస్తున్న ఫిర్యాదులకు నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజల నుంచి అదనపు ఎస్పీ నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారితో ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఫిర్యాదులను సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కరించాలని ఆదేశించారు.

కుక్కల దాడిలో మహిళకు గాయాలు

రామసముద్రం : కుక్కలు కాట్లాడుకుంటూ దారిలో వెళుతున్న మహిళపై పడటంతో గాయపడిన సంఘటన మండలంలోని చెంబకూరులో సోమవారం చోటు చేసుకుంది. చెంబకూరుకు చెందిన భారతమ్మ(60) దారిలో వెళుతుండగా కుక్కలు కాట్లాడుకుంటూ మహిళను కిందపడేశాయి. గాయాలపాలైన భారతమ్మను మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. గ్రామాల్లో కుక్కల బెడద అధికమైందని, రోడ్లపై ప్రయాణించాలంటే భయంగా ఉందని, అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

విద్యుదాఘాతంతో పాడిఆవు మృతి



మృతిచెందిన పాడిఆవు

చిన్నమండెం : మండల పరిధిలోని దేవగుడిపల్లె గ్రామం జల్లావాండ్లపల్లెకు చెందిన రైతు శ్రీనివాసులురెడ్డికి చెందిన పాడిఆవు సోమవారం విద్యుదాఘాతంతో మృతి చెందినట్లు బాధిత రైతు తెలిపాడు. పాడి ఆవును గ్రామ సమీపంలో మేత కోసం వదలగా ట్రాన్స్‌ఫార్మర్‌కు ప్రమాదవశాత్తూ తగిలి మృత్యువాతపడింది. ఆవు విలువ సుమారు రూ.1.25 లక్షలు ఉంటుందన్నాడు. ప్రభుత్వం ఆదుకోవాలని బాధిత రైతు విజ్ఞప్తి చేశాడు.

25 లీటర్ల నాటుసారా స్వాధీనం

– నిందితుడి అరెస్ట్



సారా తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్‌ను చూపుతున్న ఎక్సైజ్ పోలీసులు

మదనపల్లె : నాటుసారా తరలిస్తున్న వ్యక్తిని అరెస్ట్‌చేసి 25 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నట్లు ఎక్సైజ్ సీఐ భీమలింగ తెలిపారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ... మదనపల్లె మండలం బీకే.పల్లెకు చెందిన జి.కృష్ణ(59) ప్లాస్టిక్‌బ్యాగులో 25 లీటర్ల నాటుసారాను 500మి.లీ. చొప్పున 50 ప్యాకెట్లుగా ప్యాక్ చేసుకుని తరలిస్తుండగా, పట్టణంలోని సీటీఎం రోడ్డు పద్మావతి ఫంక్షన్ హాల్ వద్ద అరెస్ట్ చేశామన్నారు. నిందితుడి నుంచి సారా స్వాధీనం చేసుకుని, కేసు నమోదుచేసి రిమాండ్‌కు పంపినట్లు తెలిపారు.

క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలి

- హోంగార్డుల సేవలు అభినందనీయం
- రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం మహేష్ కుమార్



హోంగార్డ్స్ పరేడ్‌ను తనిఖీ చేస్తున్న కర్నూలు రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ మహేష్ కుమార్

రాయచోటి : హోంగార్డులు క్రమశిక్షణతో విధులు నిర్వర్తించాలని రాయలసీమ రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ ఎం మహేష్ కుమార్ సూచించారు. సోమవారం అన్నమయ్య జిల్లా రాయచోటిలోని జిల్లా పోలీసు పరేడ్ మైదానంలో కర్నూలు రీజనల్ హోంగార్డ్స్ కమాండెంట్ హోంగార్డుల పరేడ్‌ను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా దర్బార్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పోలీసుశాఖలో ప్రజలకు మెరుగైన సేవలను అందివ్వాలన్నారు. ఇప్పటికే పోలీసులతో సమానంగా సేవలు అందిస్తున్న హోంగార్డుల సేవలు అభినందనీయమన్నారు. హోంగార్డుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. దైనందిన విధులు సవాళ్లతో కూడుకున్నవేనన్నారు. విధులతోపాటు ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. విధుల్లో నైపుణ్యాన్ని మెరుగుపరుచుకోవాలని పలు మెలకువలు సూచించారు. డ్రిల్, కవాతు, ప్రముఖుల బందోబస్తు, ట్రాఫిక్ తదితర విధులు మరింత సమర్థవంతంగా ఎలా నిర్వహించవచ్చో దిశా నిర్దేశం చేశారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ బి చిన్ని కృష్ణ, ఏఆర్ రిజర్వ్ ఇన్‌స్పెక్టర్ ఎం పెద్దయ్య, సబ్ డివిజన్ హోంగార్డ్స్ ఇన్‌చార్జీలు శ్రీనివాసులు, రమేష్,హోంగార్డ్స్ పాల్గొన్నారు.

22న టౌన్‌బ్యాంక్ పాలకవర్గ ఎన్నికకు నామినేషన్ల స్వీకరణ

- నోటిఫికేషన్ షెడ్యూల్ ప్రకటించిన ఎన్నికల అధికారి దుర్గమ్మ
- 29న పోలింగ్, 30న ఆఫీస్ బేరర్స్ ఎంపిక
- ఓటు వేసేందుకు ఐడీ కార్డు తప్పనిసరి



టౌన్ బ్యాంక్ ఎన్నికల నోటిఫికేషన్ వివరాలు వెల్లడిస్తున్న ఎన్నికల అధికారి బి.దుర్గమ్మ

మదనపల్లె : వందేళ్ల ఘనచరిత్ర కలిగిన ది మదనపల్లె కో–ఆపరేటివ్ టౌన్‌బ్యాంక్ పాలకవర్గ ఎన్నికకు ముహూర్తం ఖరారైంది. సోమవారం ఎన్నికల అధికారి, అసిస్టెంట్ రిజిస్ట్రార్ బి.దుర్గమ్మ టౌన్ బ్యాంక్ ఎన్నికల నోటిఫికేషన్‌ను విడుదల చేశారు. నవంబర్ 22న నామినేషన్ల స్వీకరణ, 23న స్క్రూటినీ, 24న నామినేషన్ల ఉపసంహరణ ఉంటుందన్నారు. అదేరోజు సాయంత్రం 5 గంటల తర్వాత ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులను ప్రకటిస్తామన్నారు. టౌన్‌బ్యాంక్ పాలకవర్గానికి ఎన్నిక అనివార్యమైతే, నవంబర్ 29న పట్టణంలోని సొసైటీకాలనీ నెహ్రూ మున్సిపల్ హైస్కూల్‌లో ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు పోలింగ్ జరుగుతుందన్నారు. పోలింగ్ ముగిసిన తర్వాత కౌంటింగ్ నిర్వహిస్తామన్నారు. నవంబర్ 30న ఆఫీస్ బేరర్ల ఎంపికతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. టౌన్ బ్యాంక్ ఎన్నికలకు సంబంధించి సమగ్ర ఓటరు జాబితాను నోటీసుబోర్డులో ప్రదర్శించామని, సభ్యులు జాబితాలో తమ పేరు ఉందో లేదో పరిశీలించుకోవాలన్నారు. సభ్యులు తమ ఓటుహక్కు వినియోగించుకునేందుకు బ్యాంకు జారీ చేసిన ఐడీ కార్డులు తప్పనిసరి అన్నారు. ఐడీ కార్డుల కోసం సభ్యులు రెండు ఫొటోలు, బ్యాంక్ పాసుపుస్తకం తీసుకువచ్చి ఐడీ కార్డులు పొందవచ్చన్నారు. కార్యక్రమంలో టౌన్ బ్యాంక్ సీఈఓ పెరవలి ప్రసాద్, కోఆపరేటివ్ అధికారి ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి



మృతి చెందిన రామాంజి

పెద్దతిప్పసముద్రం : మండలంలోని టి.సదుం పంచాయతీ చెన్నరాయునిపల్లి సమీపంలో సోమవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో రామాంజి(35) మృతి చెందాడు. కర్ణాటక రాష్ట్రం చిలకలనేర్పు సమీపంలోని తులగనూరుకు చెందిన రామాంజి తన భార్య లక్ష్మీదేవి, కుమారుడు నిఖిల్ (6)తో కలసి ద్విచక్ర వాహనంలో వెళుతుండగా చెన్నరాయునిపల్లి సమీపంలో ప్రమాదవశాత్తు ద్విచక్ర వాహనం ట్రాక్టర్‌ను ఢీకొంది. ఘటనలో రామాంజి తీవ్రంగా గాయపడగా గ్రామస్తులు 108 వాహనం ద్వారా చికిత్స నిమిత్తం బి.కొత్తకోట ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అయితే పరిస్థితి విషమించి మార్గ మధ్యంలో అతడు మృతి చెందినట్లు డాక్టర్లు నిర్ధారించారు. ఘటనలో గాయపడిన భార్యా, కుమారుడిని చింతామణి ఆసుపత్రికి తరలించారు.

అదనపు పనులు చేయించొద్దని ఆశల ధర్నా



జిల్లా కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశవర్కర్లు

రాయచోటి అర్బన్ : ఆశ కార్యకర్తల చేత అధికారులు అదనపు పనులు చేయించరాదని సీపీఎం జిల్లా కార్యదర్శి శ్రీనివాసులు అన్నారు. ఏపీ ఆశ వర్కర్స్ యూనియన్ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు సోమవారం జిల్లా కలెక్టరేట్ వద్ద ఆశ వర్కర్లు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశ వర్కర్లపై కిందిస్థాయి అధికారుల వేధింపులు తీవ్రం కావడానికి జిల్లా వైద్యాశాఖ అధికారుల అలసత్వమే కారణమన్నారు. సీటీఎం పీహెచ్‌సీలో ఆశ వర్కర్లకు జనరల్ ఓపి డ్యూటీలు చేయాలని వైద్యాధికారులు వేధిస్తున్నారని, చేయ లేమంటున్న ఆశలను విధుల నుంచి తొలగిస్తామంటూ బెదిరిస్తుండడం దారుణమన్నారు. ఇంద్ర ధనుస్సు హౌస్ హోల్డ్స్ సర్వేకు సంబంధించిన ఫార్మెట్స్ ఇవ్వకుండా ఆశల చేత జిరాక్స్‌లకు డబ్బులు ఖర్చుచేయిస్తుండడం తగదన్నారు. ప్రభుత్వం రికార్డులు సరఫరా చేయకపోవడంతో వాటి కొనుగోలుకు ఒకొక్క ఆశవర్కరు రూ. 1500 నుంచి 2500 వరకు ఖర్చుచేస్తున్నారన్నారు. ఆశలకు అందుతున్న జీతం మీటింగ్‌లు, జిరాక్స్, రికార్డుల కొనుగోలుకు సరిపోతే వారు ఎలా బతుకుతారంటూ ఆయన మండిపడ్డారు. ఆశ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు జయమ్మ, మెహతాజున్నీసాలు మాట్లాడుతూ గతంలో నిర్వహించిన సమ్మె సందర్భంలో ప్రభుత్వం ప్రకటించిన అంశాలకు జీఓలను విడుదల చేసి వెంటనే ఆదుకోవాలన్నారు. ఈమేరకు ఆశ కార్యకర్తలు జిల్లా కలెక్టర్ చామకూరి శ్రీధర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి రామాంజులు, ఆశ వర్కర్ల సంఘం నేతలు ఫామీద, లావణ్య, రమా, మణి, గాయత్రి, సుధామణి, చెంగమ్మ, ఓబులమ్మ, గంగాదేవి, రాములమ్మ, శ్యామల, నందిని, చంద్రకళ, అనిత, సరోజ, మంజుల, నిర్మల, షాహీద పాల్గొన్నారు.

ఒంటిమిట్ట రామయ్యను దర్శించుకున్న ఎస్పీ



కోదండరామయ్య సన్నిధిలో ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు దంపతులు

ఒంటిమిట్ట : ఆంధ్రా భద్రాద్రిగా విరాజిల్లుతున్న ఒంటిమిట్ట శ్రీ కోదండరామస్వామి ఆలయాన్ని సోమవారం అన్నమయ్య, కడప ఉమ్మడి జిల్లాల ఎస్పీ వి విద్యాసాగర్ నాయుడు సతీసమేతంగా దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఆలయ ప్రదక్షణగావించి, బాలాలయంలోని సీతారామ లక్ష్మణ విగ్రహాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారిని సత్కరించి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు.

బీచ్ వాలీబాల్ జిల్లా జట్టుకు ఎంపిక



జిల్లా జట్టుకు ఎంపికైన క్రీడాకారులు

నందలూరు : బీచ్ వాలీబాల్ అండర్–19 బాలురు, బాలికల జట్టును నాగిరెడ్డిపల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని చెయ్యేరు ఒడ్డున ఎంపిక చేసినట్లు ఎస్‌జీఎఫ్ సెక్రటరీ శారద తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ ఈ ఎంపికలలో 30 మంది క్రీడాకారులు పాల్గొన్నారన్నారు. బాల బాలికలలో ఇద్దరు క్రీడాకారులు మెయిన్ టీమ్‌కు ఎంపిక చేశామన్నారు. స్టాండ్ బైలుగా రెండు టీమ్‌లకు నలుగురిని ఎంపిక చేసినట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 23, 24వ తేదీలలో బాపట్లలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీలలో పాల్గొంటారని తెలిపారు. బీచ్ వాలీబాల్ పోటీలకు టంగుటూరు ఫిజికల్ డైరెక్టర్ గణేష్ బాబు సెలక్టర్‌గా వ్యవహరించారన్నారు. పీఈటీ జగన్, ఫిజికల్ డైరెక్టర్లు, కోచ్‌లు పాల్గొన్నారు.

సినీహీరో సుమంత్‌కు సన్మానం



హీరో సుమంత్‌ను సన్మానిస్తున్న నల్లం రవిశంకర్, తదితరులు

ప్రొద్దుటూరు క్రైం : సినీ నటుడు సుమంత్‌ను ప్రొద్దుటూరు అక్కినేని అభిమానులు సన్మానించారు. సోమవారం రాత్రి రాయల్ కౌంటీలో అక్కినేని అభిమాన సంఘం జిల్లా అధ్యక్షుడు నల్లం రవిశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ప్రముఖ చారిత్రాత్మక ప్రాంతమైన గండికోటలో సుమంత్ హీరోగా 'మహేంద్ర గిరిలో వారాహి' అనే చిత్ర షూటింగ్ నిర్వహిస్తున్నారు. ఈ చిత్రం విజయవంతం కావాలని వారు ఆకాంక్షించారు. కడప జిల్లా వాసులు తనపై చూపుతున్న అభిమానాన్ని మరువనని సుమంత్ ఈ సందర్భంగా తెలిపారు. కార్యక్రమంలో అభిమానులు ఖలీల్, మనోహర్, సుదర్శన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

ఏపీఎండీసీ ఉద్యోగుల తొలగింపు తగదు

- రోడ్డున పడ్డ కుటుంబాలు
- యువగళం హామీలు ఎక్కడ ?
- రాష్ట్ర అధికార ప్రతినిధి కొరముట్ల



ఓబులవారిపల్లె : ఏపీఎండీసీలో పని చేస్తున్న ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను కూటమి ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా ఒకే సారి వందలాది మందిని తొలగించం దారుణమని రాష్ట్ర వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు విమర్శించారు. సోమవారం ఆయన వైఎస్‌ఆర్ జిల్లా ఓబులవారిపల్లెలో విలేకరులతో మాట్లాడారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రాష్ట్రం రావణకాష్టంగా మారిందని, వారు చేస్తున్న అరాచకాలకు అడ్డూ అదుపులేకుండా పోయిందన్నారు. ఏపీఎండీసీలో పని చేస్తున్న దాదాపు 123 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను ఒకే సారి తొలగించి నియంతృత్వాన్ని ప్రదర్శించారని పేర్కొన్నారు. దీంతో వందలాది మంది కుటుంబాలు రోడ్డున పడ్డాయన్నారు. మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమ పాలనలో పార్టీలకు, కులాలకు అతీతంగా రాష్ట్రంలో దాదాపు రెండు లక్షల మంది నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు కల్పించారని గుర్తు చేశారు. యువగళం పాదయాత్రలో ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు నాయుడు, నారా లోకేష్‌లు రాష్ట్రంలో నిరుద్యోగులకు 20 లక్షల మందికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చారని తెలిపారు. అధికారంలోకి వచ్చి ఆరునెలలు పూర్తి అయినా ఒక్క ఉద్యోగం కూడా ఇవ్వలేదని విమర్శించారు. 20 లక్షల ఉద్యోగాల సంగతీ దేవుడెరుగు, ప్రస్తుతం పని చేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి కడుపు కొడుతూ నిరుద్యోగులుగా మార్చేస్తున్నారని విమర్శించారు. రెండు లక్షల అరవై వేల మంది వలంటీర్లను, పదహైదు వేల మంది మద్యం షాపుల్లో పని చేస్తున్న ఉద్యోగులను, 123 మంది ఏపీఎండీసీ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను తొలగించారన్నారు. ఇందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, మంత్రి నారా లోకేష్ బాధ్యత వహించాలని అన్నారు. ప్రభుత్వం చేస్తున్న అరాచకాలను సామాజిక మాధ్యమాల్లో ప్రశ్నించిన ప్రజలపై కేసులు నమోదు చేయడం, వారిపై థర్డ్ డిగ్రీ ఉపయోగించి పౌరులకు రాజ్యాంగం కల్పించిన భావస్వేచ్ఛ హక్కును కాలరాస్తున్నారని విమర్శించారు. వీటన్నింటిపై వైఎస్సార్‌సీపీ రాబోవు రోజుల్లో పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు.

ఆటోలో పోగొట్టుకున్న హ్యాండ్ బ్యాగు అప్పగింత



మహిళకు వస్తువులను అప్పగిస్తున్న సీఐ ఎరీషావలీ

మదనపల్లె : ఆటోలో ప్రయాణిస్తున్న మహిళ మరచిపోయిన బ్యాగును పోలీసులు అప్పగించిన ఘటన సోమవారం మదనపల్లెలో జరిగింది. పీలేరు వండేవారిపల్లెకు చెందిన వెంకటనాగులమ్మ జీవనోపాధిలో భాగంగా కువైట్ వెళ్లేందుకు ప్రయాణమైంది. మదనపల్లె మీదుగా బెంగళూరుకు వెళ్లేందుకు నిర్ణయించుకుని శనివారం పీలేరు నుంచి మదనపల్లెకు చేరుకుంది. ఆర్టీసీ బస్టాండ్ నుంచి బెంగళూరు బస్టాండ్ వెళ్లేందుకు ఆటోలో బయలుదేరింది. అయితే లగేజీ దించుకునే క్రమంలో పాస్‌పోర్ట్, ఇతర పత్రాలు, వీసా కలిగిన బ్యాగును ఆటోలో మరచిపోయింది. తర్వాత కొంతసేపటికి గుర్తించి, హడావుడిగా వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. బాధిత మహిళ ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు ఆటో స్టాండ్‌లలో డ్రైవర్లను విచారిస్తుండగా, ఓ డ్రైవర్ తన ఆటోలో మహిళ బ్యాగు మరచిపోయిందని చెప్పి స్టేషన్‌లో అప్పగించి వెళ్లాడు. దీంతో వన్‌టౌన్ సీఐ ఎరీసావలీ, బాధిత మహిళకు హ్యాండ్‌బాగ్ అందజేశారు.

ఇంటి స్థలాలు మంజూరు చేయాలని సచివాలయం ముట్టడి



వైకోట సచివాలయం ఎదుట ఆందోళన చేస్తున్న బీకేఎంయూ, సీపీఐ నాయకులు

ఓబులవారిపల్లె : మండలంలోని ఇళ్లులేని నిరుపేదలకు ఇంటి స్థలాలు, నిర్మాణ సామగ్రిని ఇవ్వాలని డిమాండ్ చేస్తూ సోమవారం వైకోటలో సీపీఐ, బీకేఎంయూ నాయకులు సచివాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా బీకేఎంయూ నియోజకవర్గ నాయకులు ఎం జయరామయ్య మాట్లాడుతూ మండలంలో దళితులు, గిరిజనులు, బీసీలు, క్రిస్టియన్లు, మైనార్టీలు వేలాది మంది ఇళ్లులేనివారు ఉన్నారన్నారు. ఒకే ఇంట్లో రెండు, మూడు కుటుంబాలు ఉన్నాయని, వారు అతికష్టం మీద జీవనం సాగిస్తున్నారన్నారు. కూలి పనులు చేసుకునే పేదలను గుర్తించి వారికి ఇంటి స్థలంతో పాటు ఇంటి నిర్మాణ సామగ్రిని పంపిణీ చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటి వరకు ఒకరికి కూడా ఇంటిస్థలం మంజూరు చేయలేదని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే స్పందించి చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు నిర్వహిస్తామన్నారు. కార్యక్రమంలో డీహెచ్‌పీఎస్ మండల కార్యదర్శి కటారి గోపాల్, ఎం రాజేశ్వరీ, కె సుకన్య, మస్తాన్, జిలానీ, రమణయ్య, పేద మహిళలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఉత్తమ అధ్యాపకులకు సత్కారం



ఉత్తమ అధ్యాపక పురస్కార గ్రహీతలను సత్కరిస్తున్న వైవీయూ అధికారులు

వైవీయూ : యోగివేమన విశ్వవిద్యాలయం ఆచార్యులు ఎల్. వీరాంజనేయరెడ్డి (మైక్రోబయాలజీ), ఆచార్య జి. విజయభారతి (కామర్స్), ఎం. అనిత(ఎకనామిక్స్)లను వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య పి.పద్మ ఘనంగా సత్కరించారు. వైవీయూలో శనివారం రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార గ్రహీతల అభినందన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య కె. కృష్ణారెడ్డి మాట్లాడుతూ అవార్డు గ్రహీతలైన ఎల్. వీరాంజనేయరెడ్డి దేశంలోని టాప్–2 సైంటిస్టులలో ఒకరిని, డీఎస్‌టీ, ఫిస్ట్, యూజీసీ ప్రాజెక్టులు పొంది పరిశోధనల్లో ముందుకు వెళుతున్నారని అభినందించారు. ఆచార్య అనిత సెంట్రల్ యూనివర్సిటీ విద్యార్థి కావడం చేత సహజంగానే పరిశోధనలో ముందున్నారన్నారు. ఆచార్య జి. విజయభారతి అకడమిక్‌గా, పరిశోధనలపరంగా కార్యక్రమాల పరంగా అభివృద్ధి పథంలో ముందున్నారని తెలిపారు. ఇక్కడే చదివి, ప్రొఫెసర్‌గా బెస్ట్ టీచర్ పురస్కారం అందుకోవడం ప్రశంసనీయమన్నారు. ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథ్‌రెడ్డి మాట్లాడుతూ వచ్చే యేడాది మరిన్ని అవార్డులు రావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు పాల్గొని అవార్డు గ్రహీతలను అభినందించారు.

పెన్షనర్ల సమస్యలను సత్వరమే పరిష్కరించాలి



మాట్లాడుతున్న పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి

కడప కోటిరెడ్డిసర్కిల్ : పెన్షనర్ల న్యాయబద్ధమైన సమస్యలను పరిష్కరించి ఆయా కుటుంబాలను అన్ని విధాల ఆదుకోవాలని పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రామకృష్ణారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం కడపలోని పీఎఫ్ కార్యాలయం వద్ద పెన్షనర్లు విద్రోహ దినం పాటించారు. ఈ సందర్భంగా రామకృష్ణారెడ్డి మాట్లాడుతూ ఇపీఎస్ పెన్షనర్స్‌కు పెరిగిన నిత్యావసర వస్తువుల ధరలకు అనుగుణంగా కనీస పెన్షన్ రూ. 9000గా నిర్ణయించాలని సుదీర్ఘకాలంగా డిమాండ్ చేస్తున్నా పట్టించుకోక పోవడం తగదన్నారు. ఇపీఎస్ పెన్షనర్లకు పట్ల కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరించడం సరికాదన్నారు. నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోటీపడి అన్ని వర్గాల ప్రజలపై భారాలు మోపుతున్నాయన్నారు. నిత్యాసర వస్తువుల ధరలు మొదలుకొని గ్యాస్, పెట్రోల్, డీజిల్ ధరలు ఆకాశాన్ని అంటుతున్న నేపథ్యంలో ఈపీఎస్ పెన్షనర్స్‌కు వెయ్యి రూపాయలు పెన్షన్ ఇస్తే ఏ రకంగా బతుకుతారని ప్రశ్నించారు. ధరలు పెంచిన ప్రభుత్వం పెన్షన్ పెంచాల్సిన బాధ్యత లేదా అంటూ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. పెన్షనర్ దారులకు ఆరోగ్య సమస్యలు వెంటాడుతున్నాయని, ఈఎస్‌ఐ, ఆరోగ్యశ్రీ ద్వారా వైద్య సేవలు కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. పెన్షనర్లకు గతంలో రైల్వేలో రాయితీలు ఇచ్చే వారిని ఇప్పుడు రద్దు చేయడం అన్యాయమన్నారు. పెన్షనర్స్ సమస్యలపై గతంలో హైపవర్ కమిటీ వేశారని, దానిని బహిర్గతం చేయాలని డిమాండ్ చేశారు. పెన్షనర్ల సమస్యలపై ఫిబ్రవరిలో ఢిల్లీలో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు శ్రీకారం చుడుతున్నట్లు కేంద్ర ప్రభుత్వాన్ని హెచ్చరించారు. నిరసన కార్యక్రమంలో వామపక్ష కార్మిక సంఘాల నాయకులు శ్రీనివాసులురెడ్డి, మనోహర్, నాగ సుబ్బారెడ్డి, బిఎస్ఎన్ఎల్ ఎంప్లాయిస్ నాయకులు కళ్యా సుధాకర్, విద్యుత్ కార్మిక సంఘం నాయకులు సుదర్శన్‌రెడ్డి, యూటీఎఫ్ టీచర్స్ నాయకులు లక్ష్మీ రాజా తదితరులు పాల్గొన్నారు.

వరకట్నం వేధింపుల కేసులో ఐదేళ్లు జైలు

- రూ.3.09 లక్షల జరిమానా
- నిందితులకు శిక్ష పడేలా కృషి చేసిన సిబ్బందికి ఎస్పీ అభినందనలు

పులివెందుల రూరల్ : వరకట్నం వేధింపుల కేసులో నిందితుడికి ఐదేళ్ల జైలు శిక్ష, రూ. 3.09 లక్షల జరిమానా విధిస్తూ సోమవారం అదనపు సీనియర్ సివిల్ జడ్జి కే. ప్రత్యూషా కుమారి తీర్పు నిచ్చారు. వివరాలిలా.. పట్టణంలోని జెండామాను వీధిలో ఉంటున్న గూడుబాయి అల్లాబకాష్ కుమార్తె రేష్మాను స్థానిక అదే వీధికి చెందిన షేక్ మహబూబ్ బాషా కుమారుడు మహమ్మద్ రఫీకి ఇచ్చి 2008లో వివాహం చేశాడు. కట్నం కింద 22 తులాల బంగారం, రెండు లక్షల రూపాయలు నగదు ఇచ్చి వివాహం చేశారు. కొంత కాలం భార్యభర్తలు సంతోషంగా ఉన్నారు. వారికి ముగ్గురు పిల్లలు. ఆ తరువాత భర్త తాగుడుకు బానిపై అదనపు కట్నం కోసం భార్యను వేధించడం, మానసిక క్షోభకు గురిచేస్తున్నాడు. విషయం తల్లిదండ్రులకు చెప్పడంతో కూతురి కాపురం బాగుండాలని 3 లక్షల అదనపు కట్నం ఇచ్చారు. అయినా భర్త, అత్తమామల వేధింపులు ఆగలేదు. దీంతో రేష్మా 01.02.2018న రాత్రి తల్లిదండ్రులకు ఫోన్ చేసి భర్త, అత్తమమాలు కొడుతూ వేధిస్తున్నారు. తాను చనిపోతున్నాని చెప్పిందన్నారు. ఆ రాత్రి రాత్రి 11 గంటలకు ఉరి వేసుకుని రేష్మా చనిపోయింది. మృతురాలి సోదరుడు హబీబుల్లా ఫిర్యాదు మేరకు అప్పట్లో కేసు నమోదు చేశారు. నిందితుడిని అరెస్టు చేశారు. కేసు పూర్వాపరాలు కోర్టుకు సమర్పించారు. ఈ కేసును విచారించిన అడిషనల్ అసిస్టెంట్ సెషన్స్ జడ్జి కోర్టు అదనపు సీనియర్ సివిల్ జడ్జి కే. ప్రత్యూషా కుమారి నేరం రుజువు కావడంతో నిందితుడు మహమ్మద్ రఫీ (38)కి ఐదు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష, రూ.3.09లక్షల జరిమానా విధించారు. సాక్ష్యాధారాలతో నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన పోలీస్ అధికారులు, సిబ్బందిని జిల్లా ఎస్పీ వి.విద్యాసాగర్ నాయుడు అభినందించారు.

ముగిసిన వెయిట్‌లిఫ్టింగ్ పోటీలు



విజేతలైన క్రీడాకారులతో నిర్వాహకులు

గుడివాడ టౌన్ : ఎన్టీఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తున్న అండర్–19 బాలురు, బాలికల వెయిట్ లిఫ్టింగ్ పోటీలు సోమవారం ముగిశాయి. ఈ నెల 16న ప్రారంభమైన పోటీల్లో రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు చెందిన క్రీడాకారులు పాల్గొన్నారు. వివిధ కేటగిరీల్లో విజేతలకు బహుమతులు అందజేశారు. పోటీల్లో స్ట్రాంగ్‌మ్యాన్‌గా డి. భానుతేజ (వైఎస్సార్ కడప జిల్లా), స్ట్రాంగ్ ఉమన్‌గా కె. తరంగిణి(తూర్పు గోదావరి) టైటిల్ సాధించగా ఓవరాల్ చాంపియన్‌షిప్ వైఎస్సార్ కడప జిల్లా క్రీడాకారులు కైవసం చేసుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు కె. దామోదరరావు, జిల్లా కార్యదర్శి రవి, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి నరేంద్ర, కృష్ణా జిల్లా ఖో–ఖో అసోసియేషన్ కార్యదర్శి మడకా ప్రసాదు, ఎన్టీఆర్ స్టేడియం జిమ్ కోచ్ మారెళ్ల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధితుల పేర్లను చేర్చాలి

జమ్మలమడుగు: గండికోట ప్రాజెక్టు మొదటి విడత గ్రామాలైన 14 గ్రామాలలో 600 మంది బాధితుల పేర్లు గెజిట్‌లో రాలేదని, అధికారులు విచారణ చేసి బాధితులకు న్యాయం చేయాలని ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి డిమాండ్‌చేశారు. శాసన మండలిలో సోమవారం ఆయన గండికోట బాధితుల పరిహారం విషయమై ప్రభుత్వాని ప్రశ్నించారు. 14గ్రామాలలో అధికారులు నిర్వహించిన సోషియో ఎకనామిక్ సర్వేలో ముంపుబాధితులకు సంబంధించిన 600 మంది బాధితుల పేర్లు లేవని, నిజమైన లబ్ధిదారులైన వీరికి ప్రభుత్వం వెంటనే న్యాయం చేయాలన్నారు. రెవెన్యూ అధికారులు సోషియో ఎకనామిక్ సర్వే జరిపి ప్రభుత్వానికి ఇప్పటికే నివేదికలను ఇచ్చారని, ప్రభుత్వం బాధితులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజి వర్తింపజేయాలని కోరారు.